క్లుప్తంగా

నేడు దివ్యాంగులకు ఉపకరణాల ఎంపిక శిబిరం

మాడుగుల రూరల్: విభిన్న ప్రతిభావంతులు (దివ్యాంగులు)కు ఉచితంగా ఉపకరణాల పంపిణీకి గుర్తింపు శిబిరాన్ని చోడవరం ప్రభుత్వ హైస్కూలులో బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.ఎస్.ఎల్. మీనాకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో మూడు చక్రాల సైకిళ్లు, వీల్‌ఛైర్లు, కృత్రిమ కాళ్లు, కాలిపర్స్, రోలేటర్స్, చెవిమిషన్లు, వాకింగ్‌స్టిక్స్, ఎ.డి.ఎల్.కిట్స్, సిపిచైర్స్, బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిల్ వంటి ఉపకరణాలు అందించడానికి అర్హులైన దివ్యాంగులను ఎంపిక చేస్తారన్నారు. ఆలిమ్‌కో సంస్థ సహకారంతో ఉపకరణాలు అందజేస్తారన్నారు. జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే శిబిరానికి సదరం సర్టిఫికెట్‌తోపాటు ఆదాయ, ఆధార్, జెరాక్స్ కాపీలు, పాసుసైజు ఫొటోలు తీసుకోని వెళ్లాలని సూచించారు.

మాడుగులలో మన మట్టి - మన దేశం



ఎంపీపీ రామధర్మజ, సర్పంచ్ కళావతి

మాడుగుల రూరల్: స్థానిక ఆర్సీఎం పాఠశాలలో మన మట్టి– మన దేశం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ యడ్ల కళావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ రామధర్మజ మాట్లాడుతు మన దేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పే విధంగా ప్రతి భారత పౌరుడు నడుచుకోవాలని సూచించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం



వెదురుపల్లిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి పద్మప్రియ

నాతవరం: సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గునుపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి పద్మప్రియ తెలిపారు. మంగళవారం వెదురుపల్లిలో వైద్య శిబిరం నిర్వహించారు. ఇటీవల వాతావరణంలో మార్పు కారణంగా గ్రామంలో విషజ్వరాలు వస్తున్నాయని స్థానికులు గునుపూడి వైద్యుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే వైద్యాధికారి ఇక్కడ వైద్య శిబిరం నిర్వహించి రోగులను పరీక్షించి మందు లు పంపిణీ చేశారు. గ్రామంలో రక్త నమూనా లు సేకరించి పరీక్షలు నిర్వహించారు. వాతావర ణం మార్పు కారణంగా ప్రజలు కాచి చల్లార్చిన నీరు తాగాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

40 లీటర్ల సారాతో ఒకరి అరెస్ట్



సారాతోపాటు స్వాధీనం చేసుకున్న వాహనం

రావికమతం: 40 లీటర్ల సారాతో నిందితుడిని అరెస్ట్ చేశామని, అతడి నుంచి టీవీఎస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని కొత్తకోట ఎస్ఐ విభీషణరావు మంగళవారం తెలిపారు. కుముందానిపేటలో సారా విక్రయిస్తున్నట్టు ముందస్తు సమాచారం అందడంతో తమ సిబ్బందితో మంగళవారం దాడి చేశామన్నారు. టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై 40 లీటర్ల సారా తరలిస్తూ నిందితుడు పట్టుబడినట్టు పేర్కొన్నారు.

పైరు.. పచ్చని తీరు



వి.సంతపాలెంలో పచ్చదనంగా వరి పంట

కె.కోటపాడు: మండలంలో వి.సంతపాలెం–ఆనందపురం గ్రామాల మధ్య వరి పంట పచ్చదనంతో కళకళలాడుతోంది. 20 రోజుల క్రితం వరినాట్లు వేసిన పొలాలన్నీ ఇటీవల కురుస్తున్న వర్షాలతో కనుచూపు మేర పచ్చగా దర్శనమిస్తున్నాయి. సాగునీటి చెరువుల్లోకి పుష్కలంగా వర్షపు నీరు చేరుకోవడంతో మంచి దిగుబడితో కూడిన పంటను సాధించగలమని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పాడిరైతుల చెంతకే పశువైద్య సేవలు



లాభదాయక గొర్రెలు,కోళ్ల యూనిట్ల గురించి వివరిస్తున్న నరసింహులు



సిబ్బంది పనితీరు, రికార్డులు పరిశీలిస్తున్న నరసింహులు

- లాభదాయకంగా కోళ్లు, గొర్రెల పెంపకం యూనిట్లు
- పశుసంవర్ధకశాఖ పాడేరు ఉప సంచాలకుడు నరసింహులు

రావికమతం: గడపగడపకు పశువైద్యం అనేలా పాడిరైతుల చెంతకే వైద్య సిబ్బంది వెళ్లి పశువులకు వైద్య సేవలందించాలని పశుసంవర్ధక శాఖ పాడేరు ఉప సంచాలకుడు సిహెచ్ నరసింహులు తెలిపారు. ఎంతో లాభదాయకమైన కోళ్లు, గొర్రెల పెంపకం యూనిట్లు అర్హులకు అందించేందుకు సిబ్బంది మరింతగా కృషి చేయాలన్నారు. రావికమతం సహాయ సంచాలకుడు చిన్నంనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం రావికమతంలో సబ్ డివిజన్ స్థాయి అధికారులు, గోపాల మిత్రలు, సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాడేరు ఉప సంచాలకుడు మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులు, ఔత్సాహిక వంతులైన యువతను గుర్తించి వారికి మినీ డెయిరీ, కోళ్లు, గొర్రెల పెంపకం యూనిట్ల స్థాపనకు కృషి చేయాలన్నారు. వీటితోపాటు సంస్థ ద్వారా అందిస్తున్న వివిధ పథకాలు, ఆధునిక పద్ధతులు గురించి రైతులకు వివరించాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ ఎలా వెళ్తున్నారో.. మనమూ క్షేత్రస్థాయిలో రైతుల కళ్లాల వద్దకే వెళ్లి పశువులకు సేవలందించడమే కాక పాడి రైతుకు భరోసాగా ఉండాలన్నారు. అనంతరం గొంప, రావికమతం రైతు భరోసా కేంద్రాలను పరిశీలించారు. సిబ్బంది ప్రగతి, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. పలువురు రైతులకు పశు ఆరోగ్య కార్డులు పంపిణీ చేశారు. పశువిజ్ఞాన బడి ద్వారా స్థానిక పాడి రైతులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పశుగ్రాస విత్తనాలను, సంపూర్ణ మిశ్రమ దాణా, పశు బీమా, సంచార వైద్య సేవలను సద్వినియోగించుకోవాలని కోరారు. గొంప సర్పంచ్ కంట్రెడ్డి గోవిందు, తట్టబంద వైద్యాధికారి నూకేశ్వరరావు, కొత్తకోట పశు వైద్యాధికారి బాలతేజ, అశ్విని పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న పశువైద్యులు గణేశ్వరరావు

ఆడపెయ్యల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

చీడికాడ: ఆడ పెయ్యల పట్ల పాడిరైతులు జాగ్రత్తలు తీసుకువాలని ఖండివరం పశువైద్యాధికారి గణేశ్వరరావు సూచించారు. మంగళవారం అప్పలరాజుపురం చుక్కావారి కళ్లాల వద్ద పశువిజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పశుపోషణ, పెయ్యల పెంపకంపై ప్రతి రైతుకు అవగాహన ఉండాలన్నారు. అందుకు ఆయా గ్రామాల సచివాలయాల ఆర్బీకేల్లో పశువైద్య సిబ్బంది సలహాలు సూచనలు తీసుకోవాలన్నారు. పశువైద్య సహాయకుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

29న దేవరాపల్లిలో జగనన్నకు చెబుదాం



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రవీంద్రనాథ్

దేవరాపల్లి: ప్రజా సమస్యలు పరిష్కారం సులభతరం చేసేందుకే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మండల స్థాయిలో నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేకాధికారి బి.రవీంద్రనాథ్ తెలిపారు. ఎంపీడీవో సమావేశ మందిరంలో ఈ నెల 29న నిర్వహించనున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై మంగళవారం మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అందుకు 12 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.లక్ష్మి, ఎంపీడీవో సిహెచ్.సుబ్బలక్ష్మి, ఈవోపీఆర్డీ నళిని పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గొలుగొండ: కంఠారం పంచాయతీ శివారు గిరిజన గ్రామం సుద్దలపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించారు. గ్రామంలో ప్రతీ ఇంటికి వెళ్లి వైద్య సిబ్బంది ఈ కార్యక్రమం గొప్పతనం గురించి వివరించారు. అనారోగ్యంతో ఎంత మంది ఉన్నారో గుర్తించారు. వారికి అన్ని విధాలా వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంటామని సీహెచ్‌వో ప్రసాద్ తెలిపారు. వైద్య సిబ్బంది ఈశ్వరరావు, జయకృష్ణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అశ్రునయనాల మధ్య అచ్చిబాబు అంతిమయాత్ర

చీడికాడ: అశ్రునయనాల మధ్య మాజీ ఎంపీపీ భర్త, వైఎస్సార్‌సీపీ నేత పోతల అచ్చిబాబు అంత్యక్రియలు తురువోలులో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. పిడుగుపాటుకు గురైన ఆయన సోమవారం సాయంత్రం మృతి చెందిన విషయం విదితమే. అచ్చిబాబు పార్థివదేహంపై వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనూరాధ పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సంఘటన తెలిసన వెంటనే అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయడు బాధిత కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి అండగా నిలుస్తామన్నారు. తంగుడుబిల్లి, అర్జునగిరి, పెదగోగాడ, చీడిపల్లి గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కడసారి వీడ్కోలు పలికారు. అచ్చిబాబు మృతదేహం వద్ద వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు యర్రా అప్పారావు, టీడీపీ మండల స్థాయి నేతలు నివాళులర్పించారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు

గొలుగొండ: ప్రభుత్వం నిరుపేద విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందని, వాటిని పూర్తిస్థాయిలో సద్వినియోగించుకోవాలని దళిత సేవా పరిరక్షణ జిల్లా అధ్యక్షుడు యాదిగిరి దాసు తెలిపారు. ఆయన మంగళవారం కమిటీ సభ్యులతో కలిసి స్థానిక గురుకుల కళాశాలను సందర్శించారు. భోజనం పరిశీలించారు. విద్యార్థులకు ప్రభు త్వం అందించే ప్రతీ సౌకర్యం కల్పించాలన్నా రు. అనంతరం తహసీల్దార్ ఆనందరావును సత్కరించారు. మెరుగైన సేవలు అందించడం వల్ల మంచి గుర్తింపు వస్తుందని తెలిపా రు. గొలుగొండ, ఏఎల్‌పురం సర్పంచ్‌లు కసిపల్లి బుజ్జి, లోచల సుజాత, కమిటీ సభ్యులు ఎంఎ రాజు, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

87 మంది రోగులకు వైద్య పరీక్షలు



ఆరోగ్య పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యాధికారి సుబ్రహ్మణ్యం

కె.కోటపాడు: ఎపిడమిక్ సీజన్ కావడంతో ప్రజలందరూ ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి బి.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా మంగళవారం కె.కె.అగ్రహారంలో 87 మంది రోగులను పరీక్షించారు. అచేతన స్థితిలో ఉంటున్న ఆరుగురి రోగుల ఇళ్లకు వెళ్లి పరీక్షించి మందులు అందజేశారు. హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, హెచ్.వి. అచ్చియ్యమ్మ, ఏఎన్‌ఎం చిన్నమ్మలు, మానస తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో భారీ అన్నసమారాధన



వినాయకుడిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు



దేవరాపల్లిలో శివలింగం ఆకారంలో దీపాలంకరణ

దేవరాపల్లి: వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో విరివిగా అన్నసమారాధనలు నిర్వహించడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్సీ కాలనీలోని వినాయకుని మండపం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆయన భక్తులకు వడ్డన చేసి ప్రారంభించారు. దేవరాపల్లితోపాటు వివిధ గ్రామాల ప్రజలు తరలివచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. అంతకు ముందు వినాయకుడిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. స్థానిక యూత్ సభ్యులను భాస్కరరావు ప్రత్యేకంగా అభినందించారు.

ఆకట్టుకున్న దీపాలంకరణ

దేవరాపల్లి: వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా స్థానిక కుమ్మరి వీధిలోని లక్ష్మీగణపతి ఆలయం వద్ద దీపాలంకరణ ఆకట్టుకుంది. ఆలయం ఎదుట శివలింగం ఆకారంలో వరుస క్రమంలో పేర్చిన దీపాలు భక్తజనాన్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చి అత్యంత భక్తి శ్రద్ధలతో దీపాలంకరణ చేశారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, వాలేటి నాగరాజు, తదితర గ్రామ పెద్దలు, యూత్ తిలకించారు.



ఓం ఆకారంలో ఆకట్టుకుంటున్న దీపారాధన

చీడికాడ: దిబ్బపాలెంలో వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా బాలగణపతి వద్ద దీపారాధన కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమంలో యువతులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో దీపాలను వెలిగించారు.

కిల్కారీ సేవలను వినియోగించుకోవాలి

అనకాపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వ కుటుంబ ఆరోగ్య మంత్రిత్వ శాఖ అందుబాటులోకి తెచ్చిన కిల్కారీ సేవలను గర్భిణులు, బాలింతలు వినియోగించుకోవాలని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్‌కే నస్రత్ షమీమ్ సూచించారు. మంగళవారం ఆస్పత్రి ఆవరణలో కిల్కారీ సేవలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మాతా శిశు మరణాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా అమలు చేస్తోందన్నారు. వాయిస్ మెసేజ్‌ల ద్వారా గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య జాగ్రత్తలు వినిపిస్తాయన్నారు. అవసరమైన వైద్య పరీక్షలు, శిశువుల పెంపకం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఇంటింటికీ వచ్చి ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు వివరిస్తారని తెలిపారు. అంతకుముందు ఏఎన్ఎంలు కిల్కారీ సేవలకు సంబంధించిన బ్యానర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో కిల్కారీ మొబైల్ అకాడమీ ప్రొగ్రాం అధికారి ఆర్ మోహనరావు, డాక్టర్ వాణీ జగదీశ్వరి, సీహెచ్‌వో డి.శారద, హెచ్‌వీ ఎం.మరియమ్మ, ఎంపీహెచ్ఎస్ బి.సంగం, పీహెచ్‌సీ పరిధిలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.



తుమ్మపాల పీహెచ్‌సీలో కిల్కారీ సేవలపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, ఏఎన్‌ఎంలు

అర్జీదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

మండల ప్రత్యేకాధికారి ప్రసాదరావు



సమీక్షలో పాల్గొన్న అధికారులు

రోలుగుంట: స్పందన అర్జీదారుల నుంచి వినతులను ఆప్యాయంగా స్వీకరించి, వాటిని పరిష్కరించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని అమలుపరచాల్సిన బాధ్యత తమపై ఉందని మండల ప్రత్యేకాధికారి ప్రసాదరావు, ఎంపీడీవో ప్రభాకర్రావు ఆయా శాఖల అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్న స్పందన నిర్వహణపై మంగళవారం మండల స్థాయి అధికారులతో వారు సమీక్షించారు. సంక్షేమ పథకాలతోపాటు మంజూరు చేసిన నిధులతో వాటి నిర్మాణాల పురోగతిపై శాఖల వారీగా చర్చించారు. ప్రధానంగా సంక్షేమ పథకాల మంజూరు, లబ్ధిదారులకు అందజేతపై చర్చించి, ఏ ఒక్కరి పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించొద్దని సూచించారు. తహసీల్దార్ కె.వరహాలు, ఎస్సై బి.నాగకార్తీక్, వెలుగు ఏపీఎం సాధన, ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారి సూర్యామణి, ఏఈలు ఉమామహేశ్వరుడు, ప్రేమానందం, రాజు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు భూహక్కు పట్టాల పంపిణీ



రైతులకు భూహక్కు పట్టాలు అందజేస్తున్న తహసీల్దార్ అన్నాజీరావు

నర్సీపట్నం: గురంధరపాలెంలో మంగళవారం భూహక్కు పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ అన్నాజీరావు రైతులకు భూహక్కు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్ల నాటి భూ సమస్యలకు జగనన్న రీసర్వే ద్వారా పరిష్కారం లభించిందన్నారు. చిన్న చిన్న సమస్యలతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగే వారన్నారు. ఆ పరిస్థితి లేకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు భూములను సర్వే చేసి హద్దులు నిర్ధారించామన్నారు. దశల వారీగా అన్ని గ్రామాల్లో భూహక్కు పట్టాలను అందజేస్తామన్నారు. సర్పంచ్ శానాపతి వెంకటరత్నం, ఆర్ఐ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మహిళా కోలాటం బృందానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయాన్ని అందిస్తున్న ఉప సర్పంచ్ కరక అప్పలరాజు

నాతవరం: గ్రామాల్లో ప్రజల్లో భక్తిభావం పెంపొందించేందుకు మహిళా కోలాటం ఎంతగానో దోహదపడుతుందని వైఎస్సార్‌సీపీ నేత, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు అన్నారు. స్థానిక శ్రీలక్ష్మి నరసింహస్వామి కోలాటం బృందానికి అంకంరెడ్డి నూకరాజునాయుడు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో కుటుంబ సభ్యుల సమక్షంలో రూ. 10 వేలు మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో వినాయక గుడి, కోటమ్మతల్లి ఆలయాలు సర్వాంగ సుందరంగా నిర్మించామన్నారు. ఆలయాల వద్ద మహిళలు కోలాటం, భజనలు చేయడంతో ప్రజల్లో మరింత భక్తి భావం పెరుగుతుందన్నారు. నూకాలమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్ అంకంరెడ్డి వెంకటరమణ, విశ్రాంత సూపరింటెండెంట్ ఎ.శ్రీరామమూర్తి, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శెట్టి లచ్చబాబు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మాడుగుల: స్థానిక పాల సొసైటీ ఆవరణలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. భారత నిర్మాణ సేవా ట్రస్టు, విశాఖ శంకర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ యడ్ల కళావతి, బువ్వ బుచ్చెయ్య చౌదరి ప్రారంభించారు. 260 మంది కంటి రోగులను పరీక్షించగా, వీరిలో 80 మందిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి, విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. అప్తాలమిస్టు హరిచందన, మాడుగులకు చెందిన నాగలక్ష్మి కంటి రోగులను పరీక్షించారు. క్యాంపు ఆర్గనైజరు అరుణ్‌కుమార్, ట్రస్టు సభ్యులు పేలూరు కృష్ణ, సిహెచ్. మధు, జాగాని ఈశ్వరావు, పెదపాటి నాగు, కొప్పాక రామ్‌కీ, పసగడుగుల సూరిబాబు, భార్గవ్, తాళ్లపురెడ్డి నాగచంద్ర, డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు బైక్ యాత్ర



ఆనందపురంలో కరపత్రాలను అందిస్తున్న సీపీఎం నాయకులు

కె.కోటపాడు: విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఈ నెల 20 నుంచి 29 వరకు ఉక్కు పరిరక్షణ యాత్ర నిర్వహిస్తున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు తెలిపారు. ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో నిర్వహించనున్న బైక్‌యాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆనందపురం, వారాడ గ్రామాల్లో పార్టీ నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 32 మంది ప్రాణత్యాగాలతో 16వేల మంది రైతులకు సంబంధించి 22 వేల ఎకరాల భూత్యాగ ఫలితంగా లక్షల మందికి స్టీల్ ప్లాంట్ ఉపాధి కల్పిస్తుందన్నారు. ఇటువంటి స్టీల్ ప్లాంట్‌ను అమ్మకం చేయడానికి చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉత్తరాంధ్రలో బైక్ యాత్రను నిర్వహించి ప్రజా మద్దతుతో బుద్ధి చెబుతామన్నారు. సీపీఎం నాయకులు గండి నాయినిబాబు, యర్రా దేముడు పాల్గొన్నారు.

ఆదివాసీల సాగు హక్కులకు రక్షణ కల్పించాలి

సీపీఐఎంఎల్ లిబరేషన్ డిమాండ్



ధ్వంసమైన పండ్ల తోటలను పరిశీలిస్తున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు

రోలుగుంట: ఆదివాసీల సాగుహక్కులకు రక్షణ కల్పించాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ నాయకుడు బంగార్రావు డిమాండ్ చేశారు. ఈ నెల 20న కొయ్యూరు జెడ్పీటీసీ నూకరాజు తన అనుచరులతో రోలుగుంట మండలం ఎం.కె.పట్నం రెవెన్యూ చటర్జీపురంలో 139 సర్వే నంబరులో పండ్ల తోటలను గ్రామస్తులతో ఉన్న భూవివాదంతో ధ్వంసం చేసిన విషయం విదితమే. ఈ వివాదంలో పంట నష్టం జరిగిన బాధిత కుటుంబాలను సీపీఐఎంఎల్, అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పి.ఎస్.అజయ్ కుమార్ తదితరులు పరామర్శించారు. ధ్వంసమైన పండ్ల తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాగా ఏర్పడిన తర్వాత నాన్ షెడ్యూల్ మండలంలోని ఆదివాసీల భూములు కబ్జాదారుల బారిన పడుతున్నాయన్నారు. భూముల రేట్లు పెరిగిపోవడంతో భూమాఫియా కొంతమంది రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనిలో భాగంగానే ఇక్కడ దీర్ఘకాలంగా సాగులో ఉన్న వారి పేర్లు రికార్డుల నుంచి తొలగించారన్నారు. వాటిని పునరుద్ధరించుకుంటే ఇక్కడ బాధత ఆదివాసీలకు మద్దతుగా అందోళనకు దిగాల్సి ఉంటుందని హెచ్చరించారు. బి.వాసు దేవరావు, జనార్దన్, మానుకొండ లచ్చబాబు, కళ్యాణ కృష్ణ పాల్గొన్నారు.